ములుగు-జయశంకర్ భూపాలపల్లి
గురువారం 23 నవంబర్ 2023



# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!

# పాత రోజులు వద్దే వద్దు






## కాంగ్రెస్ వస్తే మళ్లీ కష్టాలు మొదలైనట్టే..

ఏటూరునాగారం : తెలంగాణ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకచ్చిన తర్వాత పూర్తి దళారీ వ్యవస్థ పోయింది. గతంలో అధికారుల చుట్టూ పట్టా పుస్తకాల మార్పిడి కోసం తిరగడం, లంచాలు ఇవ్వడం, రికార్డులు లేవని చెప్పడం జరిగేది. ఒక్కసారే కేసీఆర్ ధరణి పోర్టల్‌తో చెక్ పెట్టారు. రిజిస్ట్రేషన్లు, పట్టా మార్పిడి గంటలోపే పూర్తి చేస్తున్నరు. ఇది లేకుంటే రైతులకు కష్టాలు తప్పవు. మాన్యువల్ ఉన్నపుడు పహాణీలు, కాస్తు కాలం, వారసత్వం అనే లింకులతో ఇబ్బంది పడేది. ఇప్పుడు అమ్మడం, కొనడం తేలిగ్గా అవుతున్నయి. స్లాట్‌బుక్ చేసుకున్నంక తొందరగానే పని పూర్తవుతుంది. ఇక రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగేదీ లేదు. డబ్బులు ఇచ్చేది లేదు. అధికారులు, కార్యాలయాల చుట్టూ రైతులు పడిగాపులు పడే రోజులు పోయాయి. అలాంటి రోజులను కాంగ్రెస్ మళ్లీ తీసుకువస్తే రైతులను ఇబ్బంది పెట్టినట్లే. కేసీఆర్ ఉచితంగా కరెంటు కూడా రైతులకు ఇస్తున్నడు. దీంతో ఎంతో మేలు జరుగుతోంది. మంచిచేసే వారికి మద్దతియ్యాలె.

**- సరికొప్పల వెంకటేశ్వర్లు, మిర్చి రైతు, ఏటూరునాగారం**



## ధరణి తీసేస్తమన్న కాంగ్రెస్ మాకెందుకు..?

కాళేశ్వరం : తెలంగాణ సర్కారు తీసుకొచ్చిన ధరణి వ్యవస్థతో మా భూములు భద్రంగా ఉన్నయి. రైతుబంధు పైసలు ఠక్కున మా బ్యాంకు ఖాతాల పడుతానయ్. కష్టం వచ్చి భూమి అమ్ముకున్నా, భూమి కొన్నా క్షణాల్ల పని అయితాంది. ఇప్పుడు కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తమంటున్నరు. ధరణి పోతే ఇంకేమన్నా ఉన్నదా. పాత రెవెన్యూ పద్ధతులతో ఆగమాగం చేస్తరు. దళారులదే రాజ్యం నడుస్తది. పటేల్, పట్వారీ వ్యవస్థలు వస్తే లంచాలు ఇయ్యలేక మా భూములు అమ్ముకోవాల్సి వస్తది. రైతు కష్టాలను దగ్గర నుంచి చూసిన కేసీఆర్ ధరణిని తెచ్చి మా కష్టాలు తీర్చిండు. ఆయనకు రుణపడి ఉంటం. ధరణిని తీసేస్తమన్న కాంగ్రెసోళ్లను తెలంగాణ నుంచి తరిమికొట్టాలి.

**- కావేరి సంతోష్, పుస్కుపల్లి, కాళేశ్వరం**

## కేసీఆర్ ప్రభుత్వంలనే భూములు భద్రంగ ఉంటయ్



చిట్యాల : కాంగ్రెసోళ్లు ధరణి తీసేస్తామంటే మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిందే.. పైరవీకారుల కాలం వచ్చినట్లే. ధరణి పోర్టల్‌తోనే మా భూములు భద్రంగా ఉన్నయ్. ఎంత భూమి ఉంటే అంత రైతు బంధు పడుతున్నది. దురదృష్టవశాత్తు రైతు మరణిస్తే రూ.5లక్షల బీమా సౌకర్యం లభిస్తుంది. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి భరోసాగా ఉంటున్నది. ధరణిపోతే ఇవన్నీ ఎట్ల వస్తయ్. పట్టాదారు, అనుభవదారు, కబ్జాదారులుగా మళ్లీ విభజిస్తే కాస్తులో ఉన్న రైతులపై పట్టాదారుల పెత్తనం కొనసాగుతుంది. పట్టాదారుగా రైతులు మార్చుకునేందుకు మళ్లీ ఆఫీసులు చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాలి. పైరవీకారులకు పైసలివ్వాలి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉంటేనే రైతులకు మంచి జరుగుతది.

**- తిరునహరి వెంకటేశ్వర్లు, కొత్తపేట, చిట్యాల**

'దేశాన్ని దాదాపు 60ఏండ్లు పాలించిన కాంగ్రెస్, రైతుల కష్టాలను ఏనాడైనా తీర్చిందా.. నాడు కరెంటు ఎప్పుడు వస్తదో ఎప్పుడు పోతదో తెల్వని పరిస్థితి. రాత్రిపూట చేన్లకాడికి పోయి పాములు, విష పురుగులు కుట్టి ఎంతమంది సచ్చిపోయిన్రు.. ఉండీలేని కరెంటు తోని పొలాలు తడువక ఎన్నిసార్లు పంటలు ఎండిపోయినయ్.. అవన్ని ఎట్ల మర్శిపోతం..' అంటున్నరు రైతులు. వ్యవసాయానికి కాంగ్రెస్ మూడు గంటల కరెంటు చాలంటున్నదని, మూడు గంటలతోటి మూడు మడులు కూడా తడువయని, ఎద్దు, ఎవుసం తెల్వనోళ్లు ఇలానే మాట్లాడుతరని ఎద్దేవా చేస్తున్నారు. 10హెచ్‌పీ మోటర్లకు కరెంటు ఎంతకావాలె.. ఇప్పుడు రైతుల పొలాలన్నిటికీ 10 హెచ్‌పీ మోటర్లు ఎవరు పెట్టాలె అని ప్రశ్నిస్తున్నారు. అంతపెద్ద మోటరు పెడితే బోరు బావుల్లో ఊట ఉంటదా అని అడుగుతున్నారు. కాంగ్రెస్ వాళ్ల వల్లే తాము చేతుల్లో పైసలు లేక బక్కవడ్డమని, తెలంగాణ ప్రభుత్వం వచ్చాకనే నాలుగు పైసలు కనవడుతున్నయని చెబుతున్నారు. 24గంటల కరెంటు తోని ఇప్పుడు రందిలేకుంట ఎవుసం చేసుకుంటున్నామని, మళ్లీ పాతరోజులు వద్దని తెగేసి చెబుతున్నారు. ధరణిని తీసేసి భూమాతను తెస్తామని కాంగ్రెసోళ్లు అంటున్నారని, వాళ్ల తీరు చూస్తుంటే మళ్లీ దళారుల వ్యవస్థను తెచ్చి దండుకోవాలని చూస్తున్నారని అర్థమవుతోందంటున్నారు. ఇప్పుడు ధరణిలో భూముల రిజిస్ట్రేషన్లు నిమిషాల్లోనే పూర్తవుతున్నాయని, చాలా సమస్యలు పరిష్కారమై సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఇంత మంచి పోర్టల్‌ను తీసేసి మళ్లా కొట్లాటలు పెట్టే పాత వ్యవస్థను తెస్తామనడం ఏం పద్ధతని ప్రశ్నిస్తున్నారు.

**- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 22**

> మూడు గంటల కరెంటుతో మూడు మడులు కూడా పారవు

> ఇప్పుడే మంచిగ నడుస్తాంది

**10హెచ్‌పీ మోటర్లు పెడితే నీళ్లు ఆగుతయా?**
- అంత ధరపెట్టి ఎవరు కొనాలె?
- కాంగ్రెస్సోళ్లు సోయుండే మాట్లాడుతున్నరా?
- ధరణి తీసేస్తే మళ్ల గోసనే.. దళారుల వ్యవస్థ వస్తే ఆగమైతం
- తెగేసి చెబుతున్న కర్షకలోకం



## ధరణిలో వచ్చినప్పటి నుంచి రైతుబంధు వత్తాంది

మంగపేట : ఎన్కటి పట్వారీ పద్ధతి కంటే గిప్పుడున్న ధరణి పద్ధతే బాగున్నది. నా భర్త చనిపోయినంక బోరునర్సాపురం దగ్గర మాకున్న రెండెకరాల పొలం నా పేరు మీద ధరణిలో నమోదైంది. నా పేరు మీదికి భూమి వచ్చినంక రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్నం. అప్పటి నుంచి వానకాలం, యాసంగి సీజన్లకు కలిపి మొత్తం ఇరవై వేల రూపాయల రైతుబంధు అత్తాంది. పంట పెట్టుబడికి ఇబ్బంది లేకుండా పోయింది. ఇంతకు ముందున్న సర్కారోళ్లు ఎవలు కూడా గిట్ల ప్రతి ఏడాది రెండు సీజన్లలో రైతుబంధు ఇయ్యలె. ధరణి వల్ల మా పొలాలు వేరేటోళ్లకు మారే అవకాశం కూడా లేదు. ఈ పద్ధతి ఉంటెనే పొలాలకు భద్రత ఉంటది. పంట పెట్టుబడికి రైతుబంధు వత్తది. ధరణిని ఎప్పటికి ఇట్లనే ఉంచాలె. లేకపోతే రైతులు పట్వార్ల చుట్టూ తిరుగాల్సి వస్తది. ధరణి తీసేస్తమనేటోళ్ల మాటలు అసలే వినం. ఇంత మంచి పద్ధతి పెట్టిన కేసీఆర్ సర్కారు మళ్ల రావాలని కోరుకుంటానం.

**-దుర్గం లక్ష్మి, బోరునర్సాపురం, మంగపేట**



## కాంగ్రెసోళ్లను నమ్మితే మళ్ల గోస పడుతం

పలిమెల: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మొదటగా గోస పడేది రైతులే. కాంగ్రెస్ గతంలో అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఏం మేలు చేసిందో అందరికి తెలుసు.తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ద్వారా మా భూములకు భరోసా కలిగింది.మా బొటన వేలు ముద్రలు వేస్తే గాని పట్టాలు మార్పిడి కావు. తె లంగాణ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పెట్టుబడి సా యంతో రైతులంతా ప్రశాంతంగా జీవిస్తున్నరు. కాం గ్రెసోళ్లు ధరణిని రద్దు చేస్తమంటున్నరు. పాత పద్ధతి మళ్లీ వస్తే భూముల రికార్డులు తారుమారైతయ్. ప ట్టాల కోసం వీఆర్వోలకు, ఎమ్మార్వోలకు లంచం ఇస్తే గాని పనులు కావు. కాంగ్రెస్ కల్లబొల్లి మాటలు నమ్మి ఓటేస్లే రైతుల పరిస్థితి అగమైతది.

**- పడాల రమేశ్, రైతు, పలిమెల**

## కేసీఆర్ ప్రభుత్వం ఇస్తున్న కరెంట్ సాలు

ములుగు రూరల్ : సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో రైతులు సంబురంగా ఉన్నరు. కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్ ఇస్తామని అంటే రైతులు ఎట్ల బతుకుతరు. అది సాధ్యం కాని ముచ్చట. రైతులకు రైతు బంధు, 24 గంటల కరెంట్ ఉచిత కరెంట్ ఇయ్యనే బట్టే. రైతుల బాయిలకాడ కరెంట్ మీటర్లు లేవు. నీళ్లు పుష్కలంగా వస్తున్నాయి. 10 హెచ్‌పీ మోటర్లతో బోర్లలో నీళ్లు ఒక దెబ్బకు అయిపోతయి. మరి ఆ తర్వాత పంటకు నీళ్లు ఎక్కడి నుంచి వత్తయి. 5 హెచ్‌పీ మోటర్లు సాలు. కాంగ్రెస్ వాళ్ల మాటలు నమ్మితే మునుగుడే. ప్రస్తుతం రైతులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని విధాలుగా మంచే చేస్తుంది. కాకుంటే కొనుగోలు కేంద్రాల వద్ద మిల్లర్లు కటింగ్‌లు పెడుతున్నారు. ఈ విషయం పెద్ద సారు దృష్టికి తీసుకెళ్లాలి.

**- బాదావత్ శశిరేఖ, రెడ్యానాయక్, ములుగు జిల్లా కేంద్రం మాధవరావుపల్లి గ్రామ రైతులు**



## కాంగ్రెస్ వత్తె.. ఎవుసం బంద్‌వెట్టుడే



ములుగు, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ) : మూడు గంటల కరెంట్ తోని బోరు మోటరుతో నీళ్లు పారిస్తే ఒక్క దొయ్య కూడా పారదు. మా దగ్గర పెద్ద పెద్ద దొయ్యలు (మడులు) ఉంటాయి. ఇప్పటికే 24గంటల కరెంట్ వస్తున్నా అప్పుడప్పుడు కొన్ని దొయ్యలకు నీళ్ళు అందుతలెవ్వు. అలాంటిది మూడు గంటల కరెంట్‌తోని పొలాలు పారిచ్చుడు కాదు. వ్యవసాయం కూడా చేసుడు ఉండదు. నాకు 60 పైనే ఉంటాయి. ఇంత మంచి కరెంట్, నీళ్లు, సౌలతులు అప్పట్ల లేకపోయేది. నేను వ్యవసాయం చేసిన కాని, ఇప్పుడు శాతకాక చేయడం లేదు. నా అనుభవంతో చెపుతున్నా కాంగ్రెస్ 3 గంటల కరెంట్ అంటే రైతులు వ్యవసాయాన్ని బంద్ చేసుకోవడం తప్ప ఏమీ లేదు. కేసీఆర్ ప్రభుత్వం బాగున్నది. రైతులకు మేలే చేస్తుంది. ముసళోళ్లకు పింఛన్లు ఇచ్చుడు, కల్యాణలక్ష్మి అన్ని బాగానే ఉన్నయి. ఇప్పుడు నేను కూడా పింఛన్ తీసుకొనే అత్తాన.

**- సానికొమ్ము గట్టారెడ్డి, రైతు, చిన్నగుంటూరుపల్లి, ములుగు మండలం**

## 3గంటలిత్తె ఒక్క మడి సుత పారది..



ములుగు రూరల్ : కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంట్ ఇస్తామంటే రైతులు వ్యవసాయం బంద్ పెట్టుకోవాలని అనుకుంటున్నరో ఏందో. 3 గంటల కరెంట్‌తోని పొలం తడువదు. 24 గంటల కరెంట్‌తోనే పంటలు పండించుకుంట సంతోషంగా ఉంటున్నం. అదునుకు రైతుబంధు పైసలు పడుతున్నయి. ఉన్న కరెంట్‌తో నీళ్లు పుష్కలంగా అత్తున్నయి. అనుకున్న సమయానికి పంటలు కూడా చేతికి అత్తున్నయి. రైతులను ఇబ్బంది పెట్టే మాటలు మాట్లాడితే మంచిది కాదు. 10 హెచ్‌పీ మోటర్లు అందరికీ ఉంటయా. వాటికి పైసలు ఎన్ని కావాలె? ఎవలిత్తరు? చేసిన కష్టానికి లాభం లేకుండా వ్యవసాయం చేయాల్నా రైతులు? 3 గంటల కరెంట్ ముచ్చటే వద్దు. కేసీఆర్ ఇస్తున్న కరెంట్ బాగానే ఉంది.

**- గాదెపాక అంజయ్య , రైతు, చిన్నగుంటూరుపల్లి, ములుగు మండలం.**

## రాత్రి కరెంట్‌తో ఆగమైంది చాలు

వాజేడు : నాటి కాంగ్రెస్ పాలనలో కరెంట్ సరఫరా సక్రమంగా లేక అర్ధరాత్రి 12గంటల వరకు కూలీలను పెట్టుకొని ఎదురుచూసి ఎన్నో ఇబ్బందులు పడ్డం. ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వంలో 24 గంటల ఫ్రీ కరెంట్‌తోటి కష్టాలు పూర్తిగా తొలగిపోయి సంతోషంగా ఉన్నం. ఎవరు ఎన్ని చెప్పినా బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కరెంట్ కష్టాలు పోయి రైతుకు న్యాయం జరిగింది. ఇప్పుడు కాంగ్రెసోళ్లు 3 గంటల కరెంటే చాలంటున్నరు. గిట్లయితే మళ్ల పాత రోజులే అత్తయి. ఎవుసం తెలిసినోడు గిట్ల మాట్లాడడు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలె.

**- కురువెల్లశివన్నారాయణ, రైతు, ప్రగళ్లపల్లి, వాజేడు మండలం**






## కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలిపితే పీడ పోతది

మహదేవపూర్ : కాంగ్రెస్ వస్తే మూడు గంటల కరెంట్ ఇస్తానని రేవంత్‌రెడ్డి అంటున్నడు. ఆ కరెంట్‌తో ఒక మడి కూడా తడువదు. అదీగాక 10 హెచ్‌పీ మోటరు పెట్టుకోవాల్నట. మరి అది ఎవలు కొనియ్యాలె. గిట్ల పూటకో మాట చెప్పుకుంట ఆగం చేస్తున్రు. పనికిరాని మాటలు చెప్తున్న కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలిపితే పీడపోతది. వారి పాలనలో కరెంట్ కోసం మస్తు గోసపడ్డం. లోవోల్టేజీతో మోటర్లు కాలిపోయేది. అప్పులు చేసి వ్యవసాయం చేస్తే కరెంట్ లేక పంటలు పండక నష్టపోయేది. అన్ని తిప్పలు పడ్డా సాయం చేసినోళ్లే లేరు. సీఎం కేసీఆర్ వచ్చినంకనే మా కష్టాలు తీరినయ్. 24గంటలు ఫ్రీ కరెంట్‌తో పంటలు మంచిగ పండిత్తానం. నాలుగు రూపాలు ఎనుకేసుకుంటున్నం.

**- రత్న లచ్చిరెడ్డి, సూరారం, మహదేవపూర్**



## కాంగ్రెస్‌కి ఓటేస్తే కరెంట్ గోస తప్పదు

టేకుమట్ల : మాయమాటలు నమ్మి ఒకవేళ కాంగ్రెస్‌కు గనుక ఓటేస్తే కరెంట్ గోస తప్పదు. 24 గంటల ఉచిత కరెంట్ పోయి మూడు గంటలే వస్తది. దీంతో రైతులు పంటలు పండించుకోవడం కోసం ముప్పు తిప్పలు పడాల్సివస్తది. పంటలు ఎండి, భూములు నెర్రెలు బారి దిగుబడులు తగ్గి, పెట్టిన పెట్టుబడులు రాక అప్పుల పాలు కాక తప్పదు. మనకు నడిసె మోటర్లు 3 లేదా 5 హెచ్‌పీ ఉంటయి. కాని కాంగ్రెసోళ్లు 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్నరు. అవి కొనాలంటే మోటర్, స్టాటర్, వైర్లు, మెకానిక్ , కూలీలకు కలిపి లక్ష పైన అప్పు చేయాల్సి వత్తది. కరెంట్ సరిపోక మోటర్లు కాల్తయి. దీంతో ఏమైనా ఎక్కువ పంట పండుతదా అంటే అదీ లేదు. మరి అవసరమా కాంగ్రెస్ మనకు. అబద్ధాలు చెప్పెటోళ్లను కాదు, అన్ని చేసెటోళ్లను నమ్మి కారు గుర్తుకు ఓటేసుకుంటం. కేసీఆర్‌ను మళ్ల ముఖ్యమంత్రిని చేసుకుంటం.

**- రాజు, యువ రైతు, పెద్దంపల్లి, టేకుమట్ల**



## 24 గంటల విద్యుత్‌తో ఇబ్బందులు లేవు

వాజేడు : కరెంట్ కోసం గతంలో ఎన్నో ఇబ్బందులు పడ్డం. ఇప్పుడు ఆ భాధలు తీరాయి. కరెంట్ కోసం ఎదురుచూసే రోజులు పోయాయి. 24 గంటల కరెంట్‌తో సంబురంగా ఎవుసం చేసుకుంటున్నం. పంటలు బాగు పండుతన్నయ్. 3 గంటల కరెంట్‌తోని పంటలెట్ల పండిస్తం. ఎవుసం బంద్ పెట్టుకోవాలె. ఇప్పుడైతే కేసీఆర్ ఇస్తున్న కరెంట్‌తోని ఆనందంగా ఉంది.

**- కుర్సం రాంబాబు, రైతు, మొరుమురుకాలనీ, వాజేడు మండలం**

